

రామాయంపేట: నీటితో నిండిపోయిన మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రం



కొల్చారం: మండల కేంద్రంలో నీళ్లలో మునిగిన ధాన్యం కుప్పలను చూపెడుతున్న రైతు



రామాయంపేట: కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం కుప్పలను ఎండబెడుతున్న రైతు

# అకాల వర్షంతో అన్నదాతల అరిగోస

- రామాయంపేటలో దంచికొట్టిన వాన
- వెల్దుర్తి మండలంలో 12.4 సె.మీ, మాసాయిపేటలో 12.1 సెమీ వర్షపాతం
- కొనుగోలు కేంద్రాల్లో ఎటుచూసినా వరదే
- బస్తాల్లోని ధాన్యం మొత్తం వర్షార్పణం

రామాయంపేట/రామాయంపేట రూరల్/కొల్చారం/వెల్దుర్తి, మే 22: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం మొత్తం తడిసి ముద్దయ్యింది. రైస్‌మిల్లు లకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. బుధవారం రాత్రి మండలాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రామాయంపేట మండలంలోని రాయిలాపూర్‌లోనే 12వం దల ధాన్యం బస్తాలు రైస్‌మిల్‌కు వెళ్లేందుకు సిద్దంగా హమాలీలు ఉంచారు. వర్షం పడే సరికి లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లోనే ఉండిపోయాయి. ధాన్యం వర్షానికి కొట్టుకు పోతుంటే అక్కడే ఉన్న రైతులు కొట్టుకుపోతున్న ధాన్యం ఆపలేకపోయారు. డి.ధర్మారంలో ఈదురు గాలులకు విద్యుత్ నిలిచిపోయి స్తంభాలు కింద పడిపోయాయి. వెల్దుర్తి మండలంలో తడిసిన ధాన్యం మళ్లీ ఆరబెట్టేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇంకెన్ని రోజులు కేంద్రాల చుట్టూ తిరగాలని, చేసిన కష్టం మొత్తం కొనుగోలు కేంద్రాల వద్ద నీళ్ల పాలవుతుందని, రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తూ చిన్నచూపు చూస్తుందని రైతులు మండిపడుతున్నారు. వెల్దుర్తి మండలంలోని కుకునూర్, మన్నెవారి జలాల్‌పూర్, మంగళపర్తి, యశ్వంతరావుపేటలలో కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యం పూర్తిగా కొంటామని, రైతులు ఇబ్బందులు పడవద్దని తహసీల్దార్ బాలలక్ష్మి సూచించారు. ధాన్యం తరలించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తహసిల్దార్ తెలిపారు. మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్–మంగళపర్తి గ్రామాల మధ్య ఉన్న పెద్ద మూలమలుపు వద్ద ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ రోడ్డు కిందకు పల్టీ కొట్టింది. వెల్దుర్తి మండలంలో 12.4 సెంటీమీటర్లు, మాసాయిపేట మండలంలో 12.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.ఉ



కొల్చారం: పైతరలో తడిసిన ధాన్యం బస్తాలు



కొల్చారం: తుక్కాపూర్‌లో మొలకలు వచ్చిన ధాన్యం




రామాయంపేటలో వర్షంలోనే ధాన్యం ఎత్తుతున్న రైతులు



కొల్చారంలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపెడుతున్న రైతు



వెల్దుర్తి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు



వెల్దుర్తి: ధాన్యం బస్తాలతో బోల్తా పడిన లారీ

# ధాన్యం కొనలేని దుస్థితిలో ప్రభుత్వం

- ప్రజల దృష్టి మరల్చడానికే కాళేశ్వరం కమిషన్ నోటీసులు
- బీఆర్‌ఎస్ ఆదరణ చూడలేకనే కాంగ్రెస్ నాటకాలు
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



నర్సాపూర్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



కొల్చారం: సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

నర్సాపూర్, మే 22: ప్రజల తిరుగుబాటును మరల్చడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం కమిషన్ అంటూ నోటీసులు పంపుతూ నాటకాలు ఆడుతున్నదని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ధ్వజమెత్తారు. గురువారం నర్సాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కి, ధాన్యాన్ని కొనుగోలు చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని, అసమర్ధత పాలనతో రాష్ట్ర ప్రజలు తిరగబడుతున్నారని ఎద్దేవా చేశారు. వీటిని కప్పిపుచ్చుకోడానికే కాళేశ్వరం కమిషన్ పేరిట కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు నోటీసులు పంపించినట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అత్యుత్తమ కట్టడమని, దీంతో తెలంగాణలోని వేల ఎకరాల పంటలు సస్యశ్యామలం అయ్యాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలకులు, నాయకులు కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పే కాంగ్రెస్ నాయకులకు చెంప పెట్టులాంటిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికలప్పుడు, తప్పుడు కార్యక్రమాలు చేసినప్పుడు కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయాన్ని ముందుకేసుకుంటారని వెల్లడించారు. రజతోత్సవ సభ 10 లక్షల ప్రజలతో, కార్యకర్తలతో కేసీఆర్ విజయవంతం చేసినందుకు కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడక ఇలాంటి నోటీసులు పంపిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం కమిషన్ చైర్మన్ కరెక్ట్ కాదని కేసీఆర్ గతంలో చెప్పారని, కమిషన్ చైర్మన్ విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని చెప్పారన్నారు. బీఆర్‌ఎస్ ఆదరణ చూడలేకనే కాంగ్రెస్ నాటకాలు ఆడుతుందని ఎద్దేవా చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సత్యం గౌడ్, సంతోష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాబ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

కొల్చారం/నర్సాపూర్, మే 22: మండల పరిదిలోని వసురాం తండాకు చెందిన లంబాడి శోభకు రూ. పది వేలు, ఎనగండ్ల గ్రామానికి చెందిన లింగా గౌడ్‌కు రూ. 52 వేల సిఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. నర్సాపూర్ మండలంలోని ఖాజీపేట్‌కు చెందిన మచ్కూరి నాగమణి సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సాయంతో రూ.24 వేలు మంజూరయ్యాయి. చెక్కును ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకుడు సుధాకర్‌రెడ్డి సమక్షంలో అందజేశారు.

### అంత్యక్రియల్లో ఎమ్మెల్యే

శివ్వంపేట, మే 22: కొత్తపేటకు చెందిన తాజా మాజీ వైస్ ఎంపీపీ రేవ రమాకాంత్‌రెడ్డి తండ్రి రేవ నర్సింహారెడ్డి (75) బుధవారం హఠాన్మరణం చెందారు. ఆయన అంత్యక్రియలలో ఎమ్మెల్యేతో పాటు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, ఎంపీపీ హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ మహేశ్‌గుప్తా, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి, నర్సింహారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

#### కేసీఆర్, హరీశ్‌రావుకు నోటీసులు జారీచేయడం

# ప్రభుత్వ అహంకారానికి నిదర్శనం

**- బీఆర్‌ఎస్ పట్టణ కన్వీనర్ ఆంజనేయులు**



మెదక్ మున్సిపాలిటీ, మే 22: కాళేశ్వరం కమిషన్ పేరుతో కేసీఆర్, హరీశ్‌రావుకు నోటీసులు జారీ చేయడం ప్రభుత్వ అహంకారానికి నిదర్శమని బీఆర్‌ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు గురువారం ప్రకటనలో మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ రూ.80,500 కోట్లతో 180 టీఎంసీల నీటిని నిల్వచేసేలా, ప్రపంచంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌గా కేసీఆర్ నిర్మించారన్నారు. ఇది తెలంగాణ ప్రజలకే గర్వకారణమన్నారు. మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు 13 జిల్లాలకు సాగు, తాగు నీరు అందించేలా, పరిశ్రమలకు సైతం 20 లిఫ్టుల ద్వారా 203 కిలో మీటర్ల సురంగం ద్వారా 1531 కిలోమీటర్ల కాల్వల ద్వారా 82 పంపులతో కోటి ఎకరాలకు సాగు నీరు అందించే ఒక గొప్ప లక్ష్యంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ఆరోపణలతో ప్రజల దృష్టి మళ్లించడానికి కేసీఆర్, హరీశ్‌రావును బద్నాం చేసే కార్యక్రమం తప్ప మరోకటిలేదన్నారు. 17 నెలల కాంగ్రెస్ పాలన పూర్తిగా విఫలమైందన్నారు.

# ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి







మెదక్, (నమస్తే తెలంగాణ)/మెదక్ మున్సిపాలిటీ/మెదక్ అర్బన్, మే 22: దళిత వైతాళికుడు, సంఘ సంస్కర్త ఎంవీ భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ రాహుల్‌రాజ్ కొనియాడారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. భాగ్యరెడ్డి వర్మ ఓ గొప్ప సామాజిక సంఘ సంస్కర్త అని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అదనపు ఎస్పీ మహేందర్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. ప్రసిద్ధిగాంచిన సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ జయంతిని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి పుష్పాంజలి ఘటించారు.

# గిరిజన తండాలో సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠ



రామాయంపేట, మే 22: రామాయంపేట పురపాలికలోని గిరిజన తండాలో సేవాలాల్, జగదాంబికా మాత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, రామాయంపేట పురపాలిక మాజీ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

# సజావుగా సప్లిమెంటరీ పరీక్షలు



మెదక్ మున్సిపాలిటీ, మే 22: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సర ద్వి తీయ భాష పరీక్షకు 1165 మందికి 1080 మంది విద్యార్థులు హాజరయ్యారు. ద్వితీయ సంవత్సర ద్వితీయ భాషకు 369 మందికి 349 మంది విద్యార్థులు హాజర య్యారని ఇంటర్ నోడల్ అధికారిణి మాధవి తెలిపారు.

# పాఠశాల స్థలం కబ్జా చేసి ట్యాంక్ నిర్మాణం



కొనసాగుతున్న వాటర్ ట్యాంకు నిర్మాణం

పాపన్నపేట, మే 22: ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకుని సొంత అవసరాల కోసం వాటర్ ట్యాంక్ నిర్మించుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ మండల కన్వీనర్ ప్రవీణ్ డిమాండ్ చేశారు. మండలంలోని యూసూఫ్‌పేట ప్రైమరీ స్కూల్ ఎదురుగా నివసిస్తున్న ఒక వ్యక్తి సొంత అవసరాల కోసం పాఠశాల స్థలంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాడని ఆరోపించారు. పది రోజులుగా పనులు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పనులు ఆపకుంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

# అన్ని రంగాల్లో కాంగ్రెస్ విఫలమైంది

**- కేటీఆర్‌ను కలిసిన మాజీ జడ్పీటీసీ**



కేటీఆర్‌ను కలిసిన మాజీ జడ్పీటీసీలు

తూప్రాన్, మే 22: కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని, వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో బీఆర్‌ఎస్ విజయం సాధించడం తథ్యమని మాజీ జడ్పీటీసీలు తెలిపారు. పురపాలక, ఐటీ శాఖ మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తూప్రాన్, నాగిరెడ్డిపేట్ మాజీ జడ్పీటీసీలు రాణి సత్యనారాయణ గౌడ్, ఉమ్మన్నగారి మనోహర్ రెడ్డి ఆయన నివాసంలో గురువారం కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండాను రెపరెపలాడించేందుకు కృషి చేస్తామని కేటీఆర్‌తో తెలిపారు. అడిగిందే తడవుగా తన కూతురుకు ఐటీ రంగంలో ఉద్యోగా న్ని ఇప్పించిన కేటీఆర్‌కు రుణపడి ఉం టామని తూ ప్రాన్ మాజీ జడ్పీటీసీ రాణి సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

# సర్వీస్ రోడ్లు సరిగా లేక తరుచూ ప్రమాదాలు

- విద్యావ్యవస్థపై చిన్న చూపు తగదు: దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



వల్లభాపూర్ చౌరస్తా వద్ద రహదారుల అధికారులతో కలిసి సర్వీస్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



నార్సింగి మండలం నడిమితండా మాజీ సర్పచ్ కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే

చేగుంట, మే 22: సర్వీస్ రోడ్లు సరిగాలేక తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. వల్లభాపూర్ చౌరస్తా నుంచి నార్సింగి వరకు, నార్సింగి నుంచి ఎల్లమ దేవాలయం వరకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని, ఇటీవల జరిగిన పలు ప్రమాదాలపై రహదారుల అధికారి ఎన్‌ఎచ్‌ఏఐ పీడీ శ్రీనివాస్ రావుకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వివరించారు. విద్యా వ్యవస్థపై ప్రభుత్వం చిన్న చూపు తగదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నార్సింగి జడ్పీహెచ్‌ఎస్‌లో శిథిలావస్థలో ఉన్న భవనం, జూనియర్ కళాశాల భవనాన్ని పరిశీలించారు. కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాలు తొలిగించి కొత్త భవనాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

### వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

నార్సింగి మండలం నర్సంపల్లి తండా మాజీ సర్పంచ్ క్షత్రీయ కూతురు వివాహ వేడుకలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని వధువరులను ఆశీర్వదించారు.బీఆర్‌ఎస్ నార్సింగి మండలశాఖా అధ్యక్షులు మైలరాంబాబు,మాజీ జడ్పీటిసి బాణపురం క్రిష్ణారెడ్డి,మాజీ మండలపరిషత్ ఉపాధ్యక్షుడు ఆకుల మల్లేశంగౌడ్, భూపతి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు రంగయ్యగారి రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ బిక్యా నాయక్ తదితరులున్నారు.

### రత్నమ్మకు ఎమ్మెల్యే నివాళి

బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, రుక్మాపూర్ మాజీ సర్పంచ్ బస్కి అంజిరెడ్డి మాతృమూర్తి బసికె రత్నమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మృతదేహం వద్ద పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ చేగుంట మండలశాఖ అధ్యక్షుడు కొమండ్ల నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గాండ్ల లతనందం, డిశ్‌రాజు, ఆలీతో పాటు పలువురు మాజీ సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### కంఠారెడ్డికి తండావాసుల ఆహ్వానం

నిజాంపేట, మే 22: బచ్చురాజ్‌పల్లి తండా వాసులు బీఆర్‌ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం కలిశారు. ఈ నెల 30న బచ్చురాజ్‌పల్లి తండాలో జగదాంబ, సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. తండావాసులు నరేందర్‌నాయక్, విఠల్‌నాయక్, బాల్యానాయక్, గన్యానాయక్ ఉన్నారు.

### ఘనంగా 'ఉమెన్ ఫర్ ట్రీస్'



ఉమెన్ ఫర్ ట్రీస్‌లో మెప్మా సిబ్బంది

తూప్రాన్, మే 22: తూప్రాన్ మున్సిపల్‌లోని 11వ వార్డు పడాలపల్లిలో మెప్మా ఆధ్వర్యంలో 'ఉమెన్ ఫర్ ట్రీస్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అమృత్ మిత్ర కార్యక్రమంలో భాగంగా తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పడాలపల్లి చెరువుకట్టపై మహిళా సంఘాల ప్రతినిధులతో కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలు నాటడం, మొక్కల సంరక్షణ అవశ్యకతను మున్సిపల్ కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో మెప్మా సీవో ఆసియా, ఆర్పీలు పాల్గొన్నారు.

### ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య



నిజాంపేట, మే 22: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజాంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చల్మెడలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కంపె పరశురాములు(34) కొన్ని రోజుల క్రితం ట్రాక్టర్ కొన్నాడు. సమయం ప్రకారం ట్రాక్టర్ కిస్తీలు కట్టక బాకీపడి మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లోనే దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య బాలమణి, పిల్లలకు సెలవులు రావడంతో రెండు రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సృజన తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

చేగుంట, మే22: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన వడియారం శివారులో జరిగింది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేట మండలం సూరం గ్రామానికి చెందిన పిట్ల మహేశ్(22) బుధవారం తన స్నేహితుడు మధుతో కలిసి మాసాయిపేటలోని మరో మిత్రుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి, తిరిగి వస్తుండగా వడియారం సమీపంలో ఆగి ఉన్న డీసీఎంను వెనుక నుంచి ద్విచక్రవాహనంతో ఢీకొట్టారు. చికిత్సనిమిత్తం దవాఖానకు తరలిస్తుండగా మార్గ మధ్యలో ఒకరు మృతి చెందాడు. మృతుడి తల్లి కమలమ్మ ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమెదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గాయాలైన మధును గాంధీ దవాఖానకు తరలించారు.

# గుణాత్మకమైన విద్యను అందించాలి

**-జిల్లా విద్యాధికారి రాధాకిషన్**

రామాయంపేట, మే 22: అభ్యాసంలో మార్పులు తెచ్చి విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను నేర్పించాలని డీఈవో రాధాకిషన్ పేర్కొన్నారు. గురువారం రామాయంపేట బాలికల ఉన్నత పాఠశాలలో ఐదో రోజు శిక్షణా శిబిరానికి విచ్చేసిన డీఈవో ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయులు ముందుగా ప్రణాళికను తయారు చేసుకుని విద్యార్థులకు అభ్యాసం చేయాలన్నారు. ఆయనతో ఎంఈవో శ్రీనివాస్ ఉన్నారు.

### విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంచాలి

నిజాంపేట,మే22: విద్యార్థులలో కనీస సామర్థ్యాలు పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రాధాకిషన్ అన్నారు. గురువారం నిజాంపేట ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానానికి సంబంధించిన విషయాల్లో సామర్థ్యాల పెంపునకు ఈ శిక్షణ దోహద పడుతాయన్నారు. ఆయనతో ఎంఈవో యాదగిరి, సీఆర్పీ రాజు ఉన్నారు.

### మండల స్థాయి కెపాసిటీ బిల్డింగ్ శిక్షణను ప్రారంభం

చేగుంట, మే 22: చేగుంట జడ్పీహెచ్‌ఎస్‌లో మండలస్థాయి ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయుల కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ గురువారం ప్రారంభమైంది. దీన్ని డీఈవో రాధాకిషన్ పరిశీలించారు. మే 20 నుంచి 26 వ తేదీ వరకు ఐదు రోజుల పాటు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. నిర్వాహకులుగా ఎంఈవో నీరజ, ఆర్పీలుగా కిషన్, మల్లికార్జున్, రాజశేఖర్, తిరుపతి, రంజిత్ వ్యవరిస్తున్నట్లు పేర్కొన్నారు.

# పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న న్యాయవాది శ్వేత

మెదక్ మున్సిపాలిటీ, మే 22: ఉపాధ్యాయులు పోక్సో చట్టంపై అవగాహన ఉండాలని ప్రముఖ న్యాయవాది, పోలీస్ శాఖ లీగల్ అడ్వయిజర్ శ్వేత అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో కొనసాగుతున్న శిక్షణ శిబిరానికి గురువారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండి ఆ చట్టంలోని వివరాలు విద్యార్థులకు వివరించాలన్నారు. చట్టం అనేది లైంగిక నేరాల నుంచి 18 ఏండ్ల లోపు చిన్నారులకు రక్షణకు కల్పించే చట్టమన్నారు. శిబిరంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, కో ఆర్డినేటర్ రేఖ, రిసోర్సపర్సన్లు మహేందర్, రాజ్‌కుమార్, వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చదువుతోనే పేదరికాన్ని దూరం చేయవచ్చు

**– రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారు వెంకట్‌రెడ్డి**

నిజాంపేట, మే 22: చదువుతోనే పేదరికాన్ని సంపూర్ణంగా దూరం చేయవచ్చునని రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారు, ఎంవీఎఫ్ జాతీయ కార్యదర్శి ఆర్.వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నిజాంపేటలో డీబీఎఫ్ ఆధ్వర్యంలో రాజ్యాంగం హక్కులు, చట్టాలు, రాజకీయ ఆర్థిక పరిస్థితులు, నాయకత్వ లక్షణాలపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు సంజీవ్, రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి, కరుణాకర్, వేణు, ప్రభాకర్, చంద్రం, రాజు, నర్సింహులు, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

### 24 నుండి గంగమ్మ బోనాలు

తూప్రాన్, మే 22: ఈనెల 24 నుండి తూప్రాన్ పెద్ద చెరువు కట్టపై వెలసిన గంగమ్మ తల్లి బోనాల ఉత్సవాలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు గంగపుత్ర సంఘం అధ్యక్షులు, మత్స్యశాఖా డైరెక్టర్ గడప దేవేందర్ అన్నారు. 24న అత్యంత వైభవోపేతంగా నిర్వహించే ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ హాజరై గంగమ్మతల్లి కృపకు పాత్రులవ్వాలన్నారు.

### విద్యుత్ అధికారులకు కొత్త సెల్ నంబర్లు

రామాయంపేట, మే 22: రామాయంపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేసే అధికారులకు కొత్త సెల్ నంబర్లను ఉచితంగా అందజేసినట్లు ఏడీఏ ఆదయ్య, ఏఈ.తిరుపతి రెడ్డి పేర్కొన్నారు. గురువారం వారు తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రామాయంపేట ఏడీఈ ఆదయ్య 8712473364, ఏఈ.తిరుపతిరెడ్డి 8712473359, సబ్‌స్టేషన్ నెంబర్ 8712473432 కొత్తగా మార్చినట్లు వారు పేర్కొన్నారు. గతంలో ఉన్న సెల్‌ఫోన్ నెంబర్లు పనిచేయవని ప్రస్తుతం ప్రకటించిన నంబర్లకే వినియోగదారులు ఫోన్‌లు చేయాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, AJMEERA RAVINDER (New Name), R/o. H.No. 7-29, Shilajinagar Village, Dubbaka Mandal, Siddipet Dist., TS., hereby inform that, I have Changed My Name from AZMEERA RAVINDER (Old Name) to AJMEERA RAVINDER (New Name) for all purpose.
NT-Venkat

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.